www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
గురువారం | 25 | జూన్ | 2026 | పేజీలు: 08

# నిజామాబాద్ జిల్లాలో ఏసీబీ దాడుల కలకలం...

### ఫస్ట్ వికెట్‌గా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి..!

### తరువాతి జాబితాలో ఆర్మూర్..?






**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి :** ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి అక్రమ ఆస్తుల వ్యవహారం జిల్లాలో సంచలనంగా మారింది. తన పదవిని అడ్డం పెట్టుకొని ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 11 ప్రాంతాల్లో ఏకకాలంలో చేపట్టిన సోదాల్లో భారీగా ఆస్తులకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. మల్లారెడ్డి తన సర్వీస్ కాలంలో నిబంధనలకు విరుద్ధంగా తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులను కూడబెట్టినట్లు ఏసీబీకి అందిన విశ్వసనీయ సమాచారంతో అధికారులు పగడ్బందీ ప్రణాళిక రూపొందించి దాడులు ..మిగతా 2లో



# ఒలింపిక్ డే రన్‌తో వెల్లివిరిసిన క్రీడా స్ఫూర్తి

### ములుగులో ఘనంగా ఒలింపిక్ డే రన్--2026

### క్రీడాకారుల కోసం అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు

### జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ములుగు క్రీడాకారుల ప్రతిభపై మంత్రి ప్రశంసలు

### క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం

**ములుగు, అక్షిత ప్రతినిధి :** క్రీడా రంగంలో ములుగు జిల్లా తన ప్రత్యేక సత్తాను చాటుతోందని, జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తూ గుర్తింపు పొందుతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని, అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ. 4 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. బుధవారం ములుగు ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, భారత ..మిగతా 2లో





# ప్రతి పేదోడికి ఇల్లు

### మంత్రి జూపల్లి

### ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ వేడుకలో మంత్రి



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి, చెన్నపురావుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ..మిగతా 2లో

# ఓటర్ జాబితా ప్రక్షాళన

### ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

### కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, అక్షిత బ్యూరో :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమం జిల్లాలో జూన్ 25 నుంచి ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. ఓటరు జాబితాను మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందించేందుకు ఈ ప్రత్యేక ..మిగతా 2లో

# పేదల దరికి ప్రగతి ఫలాలు

### "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి




**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో పేదలందరికీ చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆకాంక్ష అని "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి అన్నారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి, బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాలపై ..మిగతా 2లో

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



## నిజామాబాద్ జిల్లాలో ఏసీబీ దాడుల కలకలం....

**మొదటి పేజీ తరువాయి...**

నిర్వహించారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, జూన్ 22న అక్షిత జాతీయ పత్రికలో నిజామాబాద్ జిల్లాలో ఏసీబీ దాడులు జరిగే అవకాశం ఉందని ప్రచురితమైన కథనం కేవలం ఒక్క రోజు లోనే నిజమవడంతో జిల్లాలోని అధికార వర్గాల్లో కలకలం రేగింది. "నిజామాబాద్ జిల్లాలో ఫస్ట్ వికెట్ పడింది" అంటూ అధికార వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఏసీబీ దృష్టి ఇంకా జిల్లాపైనే కొనసాగుతుందని, మరికొంత మంది అధికారుల వ్యవహారాలపై కూడా నిఘా ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో కొందరు అధికారులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. జిల్లాలో మరిన్ని అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజల్లో చర్చ సాగుతోంది. నెలరోజుల క్రితం ఆర్మూర్ డివిజన్లో కూడా ఒక అధికారి వ్యాపారుల నుండి 5 లక్షల నుండి 12 లక్షల వరకు వసూలు చేసిన అధికారి యొక్క గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అధికారుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులలో ఒకరు ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వడం వలన ఏసీబీ అధికారులు నిజామాబాద్ జిల్లాపై రెక్కీ నిర్వహిస్తున్నారని త్వరలోనే ఆర్మూర్ లో కూడా ఏసీబీ దాడులు జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు ఇప్పటినుండే జాగ్రత్త పడుతున్నారని కొందరు అధికారులు భావిస్తున్నారు ఏది ఏమైనాప్పటికీ ఏసీబీ అధికారుల యొక్క దాడులు కచ్చితంగా నిజామాబాద్ జిల్లాపై ఉంటాయని త్వరలోనే ఆర్మూర్ లో కూడా ఈ దాడులు జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

## ప్రతి పేదోడికి ఇల్లు

**మొదటి పేజీ తరువాయి...**

తొలి విడతలో రూ.22,500 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లు కేటాయించినట్లు తెలిపారు. రెండవ విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, నియోజకవర్గానికి 2 వేల ఇండ్ల చొప్పున మంజూరు చేసినట్లు చెప్పారు. కులం, మతం, వర్గం, రాజకీయ అనుబంధం చూడకుండా అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తున్నామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. ఇండ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం దశలవారీగా బిల్లులు చెల్లిస్తూ నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

## ఓటర్ జాబితా ప్రక్షాళన

**మొదటి పేజీ తరువాయి...**

సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం, ఓటరు జాబితాలోని లోపాలను సరిదిద్దడం, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులను పారదర్శకంగా నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది వంటిదని, దాని ఖచ్చితత్వం కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారని, ప్రజలు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు చురుకుగా సహకరించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ బూత్ స్థాయి అధికారులకు అవసరమైన వివరాలు అందించి సహకరించడం ద్వారా సమగ్ర, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విజ్ఞప్తి చేశారు.

# ఒలింపిక్ డే రన్‌తో వెల్లివిరిసిన క్రీడా స్ఫూర్తి

**మొదటి పేజీ తరువాయి...**

ఒలింపిక్ సంఘం, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఒలింపిక్ డే రన్--2026' కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



**క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వం అండ మంత్రి సీతక్క**

మంత్రి సీతక్క మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ములుగు జిల్లా క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తోందని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందుతున్నారని చెప్పారు. పేదరికం, వెనుకబడిన పరిస్థితులు ఉన్నప్పటికీ జిల్లాలోని యువ క్రీడాకారుల ప్రతిభ అపారమని అన్నారు. వాలీబాల్, ఆర్చరీ వంటి క్రీడల్లో ములుగు క్రీడాకారులు పతకాలు సాధించి జిల్లాకు కీర్తి తెచ్చారని గుర్తుచేశారు. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల్లోనూ విద్యార్థులు ముందుకు రావడం సంతోషకరమన్నారు.

క్రీడాకారులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనను వెంటనే ఆమోదించి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో అవసరమైన అదనపు సదుపాయాల కల్పనకు కూడా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు క్రీడలపై ఏకాగ్రత పెంపొందించుకుని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. తాము ఎంచుకున్న క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకుని ములుగు జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, డీఎస్పీ రవీందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్ల రెడ్డి, పీడీలు, పీఈటీలు, వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల దరికి ప్రగతి ఫలాలు

**మొదటి పేజీ తరువాయి...**

సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా 99 రోజుల ప్రణాళికలో శాఖల వారిగా చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి ఫోటో గ్యాలరీని కలెక్టర్, అధికారులతో కలిసి తిలకించారు.

శాఖల వారిగా చేపట్టిన కార్యక్రమాల వివరాలు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు.

ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, అన్ని శాఖలు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు అన్ని శాఖల అధికారులు విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ శాఖల వారీగా సంబంధిత పథకాలు, సంక్షేమ ఫలాలు అన్ని అట్టడుగు వర్గాల ప్రజలకు చేరే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. స్పష్టమైన ప్రణాళికతో ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు వెల్లడించిన నివేదికలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు శాఖ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల వల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఇన్నోవేటివ్ ఆలోచనలతో అధికారులు ముందుకు సాగాలన్నారు.



ప్రజల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" విజయవంతం

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

ప్రజలు, ప్రజా ప్రతినిధుల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు, గ్రామ, వార్డు సభలు, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, అరైవ్ అలైవ్ కార్యక్రమం, రైతు, మహిళా శిశు సంక్షేమ, విద్యా ఆరోగ్య, సంస్కృతిక, పర్యావరణ వారోత్సవాల పేరిట విస్తృత కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామ, వార్డు సభలు నిర్వహించి అధికారులంతా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించినట్లు వివరించారు. దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న అంశాలను పరిష్కరించినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటల దిగుబడి అధికంగా వచ్చిందని, అధికారుల సమన్వయంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని పంటలను కొనుగోలు చేశామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం నిల్వ ఉంచేందుకు అవసరమైన గోదాములను నిర్మిస్తామని చెప్పారు. రెవెన్యూకు సంబంధించిన అంశాలన్నీ తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నీరు పారే వరకు నిద్రపోం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిల ఉద్ఘాటన**

**లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి మొదటి అడుగు**

**ప్రాజెక్టు కోసం 1510 ఎకరాల భూ సేకరణలి**

**షాద్ నగర్ నియోజకవర్గంలో 278.35 ఎకరాలు**

**లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ స్థలం వద్ద ఇరు జిల్లాల అధికారులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకుల హాజరు**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** ఈప్రాంత ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రిని సైతం ఇబ్బంది పెట్టాం.. మంత్రులను కూడా వదలలేదు.. లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే అనుకున్నది మేమిద్దరం కలిసి సాధించాం.. ఇక షాద్ నగర్, పరిగి నియోజకవర్గాల్లో నీరు పారే ఇంతవరకు విశ్రమించేది లేదు అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిలు ఉద్ఘాటించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని జిల్లేడు చౌదరి గూడెం మండలం కేపీ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ ఏర్పాటు చేయబోయే స్థలంలో పెద్ద ఎత్తున మొదటి సభను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేపీ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రక్రియలో భాగంగా 587 కోట్ల రూపాయలు భూసేకరణ కోసం కేటాయించి నిధులు విడుదల చేయడం ప్రభుత్వం భూసేకరణకు మేము జారీ చేసిన నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, వికారాబాద్ అదనపు కలెక్టర్ వెంకట చారి అదేవిధంగా పునరావాసం మరియు పునర్నిర్మాణం శాఖ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇరిగేషన్ ఈఈ దయానంద్, ఆయా జిల్లాల ఎడి సర్వే అధికారులు, షాద్ నగర్ ఆర్ డి ఓ ఎన్ ఆర్ సరిత తదితర అధికారులతో పాటు స్థానిక రైతాంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున హాజరయ్యారు. రంగారెడ్డి వికారాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు స్థల పరిశీలన కోసం మొదటిసారి రావడంతో స్థానిక రైతాంగం పెద్ద ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తోపాటు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు ఈ సభలో ప్రాజెక్టు ముఖ్యమైన వివరాలను రైతాంగానికి ప్రజాప్రతినిధులకు ప్రజలకు వివరించారు. రిజర్వాయర్ నిర్మాణానికి 1510 ఎకరాల భూసేకరణ ఉంటుందని, కాలువలు ఇతర అవసరాల నిమిత్తం వాటికి వేరే భూమి అవసరం అవుతుందని తెలిపారు. 1510 ఎకరాల భూసేకరణలో షాద్ నగర్ నియోజకవర్గంలోని పద్మారం తదితర గ్రామాలలో 278.35 ఎకరాల భూమిని భూసేకరణ కోసం వినియోగిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పరిగి నియోజకవర్గంలోని సైదుపల్లిలో అత్యధికంగా 800 పైచిలుకు ఎకరాల భూమి అవసరం అవుతుందని అదేవిధంగా కుల్కచర్ల మండలంలోని అల్లాపూర్ వద్ద 83. 31 ఎకరాల భూమి అవసరం ఉంటుందని తెలిపారు. సంబంధిత రైతంగం ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలని తెలిపారు. కొంతమంది రైతుల త్యాగాలతో వేలాది మంది రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి కొందరి రైతుల త్యాగం అవసరం ఉందని వారు పేర్కొన్నారు. సహకరించిన ప్రతి రైతుకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం పరిహారం అందజేస్తుందని తెలిపారు.

**చరిత్ర మర్చిపోని రోజు..**

నేడు చరిత్ర మర్చిపోని రోజు అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిలు స్పష్టం చేశారు. ఎంతోకాలంగా ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కేపీ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిన అనంతరం నేడు అధికారుల రాకతో మొదటి అడుగు పడిందని సంతోషం వ్యక్తం చేశారు. కేపీ లక్ష్మీదేవి పల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రైతులను నాయకులను కార్యకర్తలను ఉద్దేశించి వారు మాట్లాడారు. కుర్చీ



వేసుకుని లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టును కడతానని గొప్పలు చెప్పిన కేసీఆర్ ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని, ఉత్తర తెలంగాణలో కాళేశ్వరం నిర్మించుకొని ఈ ప్రాంత ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీశారని వారు పేర్కొన్నారు. కుర్చీ వేసుకుని కడతామని శపదాలు పలికిన కేసీఆర్ కుర్చీని లాగి ఇప్పుడు అదే కుర్చీ వేసుకొని తాము ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల సూచనలు పెడచెవిన పెట్టి ఈ ప్రాంతాన్ని నిర్మానుషం చేశారని తెలిపారు. కరివేన ఉదండాపూర్ ద్వారా 6వ లిఫ్ట్ అయిన లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం త్వరలోనే పూర్తి పనులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని అన్నారు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం తామిద్దరం ఎమ్మెల్యేలం ఎంతో కష్టపడ్డామని వివరించారు.

**రెచ్చగొట్టే వాళ్ళతో జాగ్రత్త..**

కొందరు బిఆర్ఎస్ నాయకులు ప్రాజెక్టు నిర్మాణానికి అడుగులు ముందుకు పడుతుంటే ఓర్వలేకపోతున్నారని అప్పుడే గ్రామాలలో రైతులను రెచ్చగొట్టే పనులు పెట్టుకున్నారని వారి మాటలను రైతాంగం పట్టించుకోవద్దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిలు సూచించారు. 9ఏళ్ళకు పైగా రాష్ట్రాన్ని పాలించి ఆరవ లిఫ్టు లక్ష్మీదేవి పల్లిని నిర్లక్ష్యం చేసిన ప్రతిపక్ష నాయకులు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ పనులు చేపడుతుంటే గ్రామాల్లో భూనిర్వాసితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని వారు విమర్శలు గుప్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లేడు చౌదరి గూడా మండల పార్టీ అధ్యక్షుడు ఎన్ చంద్రశేఖర్, కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సీనియర్ నేతలు దామోదర్ రెడ్డి, కృష్ణారెడ్డి, చలివేంద్రం పల్లి రాజు, పద్మారం వెంకటేష్, లక్ష్మీకాంత్ రెడ్డి, షాద్ నగర్ నాయకులు రఘునాయక్, తిరుపతి రెడ్డి, శ్రీను నాయక్, బాదేపల్లి సిద్ధార్థ, బాలరాజ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, సుదర్శన్ గౌడ్, అశోక్ ఆయా గ్రామాల ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఇంటింటికీ ఓటర్ల సవరణ ప్రక్రియ

**మెటీరియల్ పంపిణీ చేసిన తహసీల్దార్**

**తిరుమలగిరి,అక్షిత ప్రతినిధి :** తిరుమలగిరి మండల పరిధిలో గురువారం (జూన్ 25) నుండి ఓటర్ల సవరణ మరియు నమోదు ప్రత్యేక కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం తిరుమలగిరి మండల కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ఓ) సవరణ ప్రక్రియకు సంబంధించిన కీలక మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ హరిప్రసాద్ మాట్లాడుతూ.. గురువారం నుండి బీఎల్ఓలు తప్పనిసరిగా తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి



క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు (డబుల్ ఓట్లు) ఉన్నా, లేదా చనిపోయిన వారి వివరాలు ఉన్నా వాటిని జాబితా నుండి తొలగించే ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టాలని ఆదేశించారు. అర్హత గల ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా ఉండడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం బీఎల్ఓలు మరియు బీఎల్ఏలు (బూత్ లెవెల్ ఏజెంట్లు) పూర్తి సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ జాన్ మొహమ్మద్, ఎన్నికల విభాగం సూపర్‌వైజర్లు, మండలంలోని బీఎల్ఓలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారి ఇలంబర్తికి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమీక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ప్రత్యేక అధికారి ఇలంబర్తికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సుశాంత్ సుఖదేవ్ బోబడే, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మంకీ రెస్క్యూ సెంటర్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ గ్రామంలోని గండిరామన్న హరితవనంలో గల మంకీ రెస్క్యూ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోతుల పట్టివేతకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పట్టుకున్న కోతులు, పునరావాసం, అందుబాటులో ఉన్న మంకీ క్యాచర్స్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం అవకతవకలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేసిన బిజెపి వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చెన్నమనేని వికాస్ రావు




**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** ధాన్యం అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా ఆడిట్ నిర్వహించాలని బిజెపి వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చెన్నమనేని వికాస్ రావు డిమాండ్ చేశారు. చందుర్తి మండలం సనుగుల గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సి ఎస్ ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి కష్టపడిన ధాన్యాన్ని విక్రయించే క్రమంలో మోసపోతున్నారని అన్నారు. రైతు భరోసా పక్కన పెడితే రైతులు మోసపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తున్నారని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన ధాన్యం అవకతవకలు రైతులకు నమ్మకద్రోహం చేయడమే అన్నారు. నకిలీ ట్రక్ షీట్లు నకిలీ రవాణా రికార్డులు పరిశీలించాలన్నారు. కోనరావుపేట మండలంలో ధాన్యం లారీలు మాయమయ్యాయని అన్నారు. ట్రక్ షీట్లలో గందరగోళం జరిగిందని నిజమైన ట్రక్ షీట్ లు పోలీస్ స్టేషన్ లో ఉన్నాయన్నారు. రైతులు ధాన్యం డబ్బుల కోసం నేటికి పడిగాపులు కాస్తున్నారని అన్నారు. జిపిఎస్ ద్వారా చేయాల్సిన పద్ధతిని అధికారుల నిర్లక్ష్యంతో అక్రమాలకు తావిస్తుందన్నారు. బాధ్యులపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇటువంటి మోసాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జగదీశ్వర్ గౌడ్ జన్మదిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో నోట్ బుక్‌ల పంపిణీ..



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** బుధవారం రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి, టీపీసీసీ జెనరల్ సెక్రటరీ వి జగదీశ్వర్ గౌడ్ జన్మదిన సందర్భంగా. పాపిరెడ్డి కాలనీ మండలపరిషత్ స్కూల్ లో నోట్ బుక్స్ పంపిణి , రాజీవ్ గృహకల్ప లో అన్నదానం కార్యక్రమంలను నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం డివిజన్ నాయకులు పల్లె వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మల్లెల జయమ్మ. పాల్వాయి రాజు. వజ్జలా శ్రీనివాస్. ఎం.డి.అలీం, బుర్రి స్వాతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు. పార్టీ కార్యకర్తలు. వడ్ల రాము. భారత్ చారీ. పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన. వి వైభవ్ గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## తాడూరు ఎంపీడీవోగా మిఠాయి శోభారాణి



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** తాడూరు మండల నూతన ఎంపీడీవో గా మిఠాయి శోభారాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఎంపీడీవో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు అచ్చంపేట నియోజకవర్గంలోని పదరా మండల్ కి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శోభారాణి మాట్లాడుతూ.. తాడూరు మండలంలో జరిగే అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హత కలిగిన లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటానని, మండలంలోని పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## పవన్ కళ్యాణ్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### ఉమ్మడి నల్గొండ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కొత్రా గోవర్ధన్



**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై చేసిన అనుచిత,అవమానకర వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని బేషరతుగా మీడియా ముఖంగా క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కొత్రా గోవర్ధన్ డిమాండ్ చేశారు.ప్రజా సేవకు,రాజకీయ విలువలకు కట్టుబడి పనిచేస్తున్న పవన్ కళ్యాణ్ ని ఉద్దేశించి ఐటమ్ సాంగ్‌లా వస్తారు,వెళ్తారు అంటూ జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అహంకారానికి నిదర్శనమని అన్నారు.ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడిని అవమానించే విధంగా మాట్లాడటం సమంజసం కాదని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని,ప్రజాస్వామ్య విలువలను గౌరవించే ప్రతి ఒక్కరూ ఇటువంటి వ్యక్తిగత విమర్శలను ఖండించాలని కోరారు.రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చు గానీ వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధమని అన్నారు.జగదీశ్ రెడ్డి తన వ్యాఖ్యలపై వెంటనే స్పందించి,వాటిని వెనక్కి తీసుకొని పవన్ కళ్యాణ్ కి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కొత్రా గోవర్ధన్ డిమాండ్ చేశారు.

# ద్వంద్వ ఓటరు నమోదులపై కఠిన చర్యలు

**ఓటరు జాబితా స్వచ్ఛతకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు**

**ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు చట్ట విరుద్ధమని హెచ్చరిక**

**తప్పుడు సమాచారం, నకిలీ పత్రాల సమర్పణపై శిక్షార్హ చర్యలు**

**ఓటరు వివరాలను పరిశీలించి తప్పులు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచన**



**ములుగు, అక్షిత ప్రతినిధి:** ఓటరు జాబితా స్వచ్ఛత, ఖచ్చితత్వాన్ని పరిరక్షించేందుకు ప్రజా ప్రాతినిధ్య చట్టం--1950లోని సెక్షన్లు 17, 18, 31 నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఓటరు నమోదుకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను ప్రజలకు వివరించారు.

సెక్షన్ 17 ప్రకారం ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదు కావడానికి అర్హుడు కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక వ్యక్తి పేరు బహుళ నియోజకవర్గాల్లో నమోదైనట్లు గుర్తిస్తే, సంబంధిత నమోదులను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెక్షన్ 18 ప్రకారం ఒకే నియోజకవర్గంలో ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువసార్లు ఓటరుగా నమోదు కావడం నిషేధించబడిందని పేర్కొన్నారు. ద్వంద్వ నమోదులను గుర్తించి తొలగించడం ద్వారా ఓటరు జాబితా పారదర్శకతను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఓటరు నమోదుకు తప్పుడు సమాచారం ఇవ్వడం, నకిలీ పత్రాలు సమర్పించడం, ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రకటనలు చేయడం సెక్షన్ 31 ప్రకారం శిక్షార్హమైన నేరమని కలెక్టర్ హెచ్చరించారు. ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధించబడతాయని స్పష్టం చేశారు.

స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితా తయారీలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. తమ ఓటరు వివరాలను పరిశీలించి సరైన సమాచారం మాత్రమే అందించాలని, ఒకటి కంటే ఎక్కువ నమోదులు ఉన్నట్లయితే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి పౌరుడు సహకరిస్తేనే ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించగలమని పేర్కొన్నారు.

## 13 వ డివిజన్ మార్కండేయనగర్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం

### 1వ డివిజన్ బృందావన్ కాలనీలో రూ.29.70 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ అక్షిత న్యూస్:** కరీంనగర్ నగర అభివృద్ధిలో భాగంగా నగరంలోని 13వ డివిజన్ మార్కండేయనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో మలయప్ప ఫౌండేషన్ సీఎస్ ఆర్ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మరియు యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించేందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నగరంలోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ తేళ్ల లక్ష్మి రమేష్ మున్సిపల్ అధికారులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.అనంతరం నగరంలోని 1వ డివిజన్ బృందావన్ కాలనీలో రూ. 29.70 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ భారి అపర్ణ జితేందర్ డీఈ వెంకటేశ్వర్లు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నూతన ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి





**జడ్చర్ల ,అక్షిత న్యూస్:** రాజాపూర్ మండలంలోని కుచర్కల్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ శివపరివారం, రామా పరివారం, నవగ్రహాలు, ధ్వజస్తంభాల నూతన ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాలు, ధార్మిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రాంతం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజంలో ఐక్యత, సత్సంబంధాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కె.జి.బి.వి, పి.హెచ్‌సి ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## గండీడ్ మండలంలో పర్యటించిన కలెక్టర్

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** గండీడ్ మండలంలో నిర్వహిస్తున్న మహమ్మదాబాద్ మండల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కె. జి. బి. వి), గండీడ్ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హచ్.సి)లను బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ముందుగా కె. జి. బి. వి పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. కె. జి. బి. వి స్పెషల్ ఆఫీసర్ కుమారి శివలీల విద్యాశాఖ ఉన్నత అధికారుల అనుమతి లేకుండా గైర్హాజరైనట్టు గమనించిన కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ కి ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మదా బాద్ మండల కె.జి.బి.వి స్పెషల్ ఆఫీసర్ కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.మహమ్మదాబాద్ కె.జి.బి.వి తనిఖీలో ఉపాధ్యాయులు వరండాలో ఉండటానికి గమనించిన కలెక్టర్ వారి వారి తరగతులలో వెళ్లాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, టైం టేబుల్ ప్రకారం విద్యార్థులకు పాఠాలు బోధించాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు,సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.





10వ తరగతి, 8వ తరగతి విద్యార్థుల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న విద్య బోధన, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఉదయం అల్పాహారం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు ఎప్పుడు పాఠశాలకు చేరుకున్నారూ, వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అనే విషయాలను కూడా కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

హాస్టల్‌లో మరుగుదొడ్ల సౌకర్యం ఎలా ఉంది, ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా, అనే విషయాల పై కూడా కలెక్టర్ విద్యార్థుల నుండి వివరాలు తెలుసుకున్నారు. స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, అక్కడ కూరగాయలను సరిగా పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు.

అనంతరం నిర్మాణంలో ఉన్న కె .జి.బి.వి నూతన భవన పనులను తనిఖీ చేశారు. కాంట్రాక్టర్, వర్కర్ల తో మాట్లాడి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. మండల విద్యాధికారికి కె .జి.బి. వి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించి ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని ఆదేశించారు.

**గండీడ్ పి.హెచ్.సి ని తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

గండీడ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రతిరోజూ నమోదవుతున్న ఓ.పి.నమోదు సంఖ్య, మందుల లభ్యత, గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, లేదా అనే అంశాలపై వైద్య అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రసవం జరిగిన ఓ మహిళతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయా అని ఆరా తీశారు.

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారికి కలెక్టర్ ఆదేశించారు.

కార్యక్రమంలో మండల విద్య అధికారి జనార్ధన్, వైద్య అధికారి డా. చందు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉంటూ నిశిత పరిశీలన చేయండి

## కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బీఎల్ఏలకు కవ్వంపల్లి పిలుపు



**మానకొండూర్ అక్షిత న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో గురువారం నుంచి కేంద్ర ఎన్నిక సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, బూత్ స్థాయి ఏజెంట్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్ఏలు జాబితాను నిశితంగా పరిశీలించి, ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని డాక్టర్ కవ్వంపల్లి కోరారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళుతున్నప్పుడు బీఎల్ఏలు తప్ప కుండా వారి వెంట ఉంటూ నిశిత పరిశీలన చేయాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం గమనిస్తూ, ఓటర్ల వివరాల సవరణలో ఎలాంటి లోపాలు ఉన్నా లేదా అనుమానాస్పద అంశాలు కనిపించినా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డాక్టర్ కవ్వంపల్లి సూచించారు. ప్రతి పది పోలింగ్ కేంద్రాలకు ఒక ఇంచార్జీని నియమించి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని, సర్ పై అన్ని గ్రామాల్లో డప్పు చాటింపు వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన కోరారు.

# కొండాపూర్, నందికందిలో విషాద కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** కొండాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగయ్య పెద్ద కుమారుడు క్రాంతి అకాల మరణం చెందడంతో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. క్రాంతి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, తీవ్ర విషాదంలో ఉన్న నాగయ్యతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రాంతి మృతి వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రాంతి అంత్యక్రియల్లో పాల్గొని చివరి నివాళులు అర్పించారు. అదే విధంగా నందికంది గ్రామంలో తన గురువుగా ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రయ్య పరమపదించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్, వారి అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. రామచంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో కొండాపూర్ సర్పంచ్ అమరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రుక్మొద్దీన్, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, గోవర్ధన్ రెడ్డి, పరమానందం, శ్యామ్‌రావు, సర్పంచ్ సతీష్, సత్యానందం, మహేష్, సర్పంచ్ మోహన్ గౌడ్, జగదీశ్వర్, శేఖర్, ఆంజనేయులు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసు నైపుణ్యాల ప్రదర్శనకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక

## జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్--2026 ప్రారంబించిన అదనపు ఎస్పీ చంద్రయ్య

**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం అత్యంత అవసరమని, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం లో నిర్వహిస్తున్న జిల్లా 3వ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్--2026 కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు, ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు.పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ





అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు అదికారులు,సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, అనుభవాలను పంచుకోవడానికి, వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు చక్కటి వేదిక అని అన్నారు.

ఈడ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్,యాంటీ-సబోటేజ్ చెకింగ్, మరియు కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడుతున్నాయన్నారు.వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు,సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అదేవిధంగా జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు లభిస్తుందని, రాష్ట్రాలు మరియు ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం, సహకారం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడి పెరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు,సి.ఐ రవి, నాగేశ్వరరావు, రవిందర్, వెంకటేష్, ఆర్.ఐ సురేష్, ఎస్.ఐ లు, ఆర్.ఐ.ఎస్ లు,సిబ్బంది పాల్గొన్నారు.

13ooo

## మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి**

**ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

**15 మంది మైనర్ వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు**




**మహబూబ్ నగర్ ,అక్షిత న్యూస్:** జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలో మైనర్ డ్రైవింగ్ నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు.

ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మొత్తం 15 మంది మైనర్ వాహనదారులను గుర్తించారు. అనంతరం వారిని మరియు వారి తల్లిదండ్రులను బుధవారం మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలు ప్రమాదాలకు దారితీసే అవకాశముందని తల్లిదండ్రులకు వివరించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలిగే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా పోలీసు శాఖ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తూ, రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మైనర్ డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరింది.

## జిల్లాలో పలుచోట్ల స్కూళ్ళు, కాలేజీలకు అత్యంత సమీపంలోనే గుట్కా, పాన్, సిగరెట్లు, పొగాకుల దుకాణాలు

**జగిత్యాల అక్షితబ్యూరో:** జగిత్యాల జిల్లాలో జిల్లా కేంద్రమైన జగిత్యాల పట్టణంలోనే కొన్ని చోట్ల గవర్నమెంట్ మరియు ప్రైవేటు విద్యాసంస్థలకు అత్యంత సమీపంలో 'సివోటిపిఎ- 2003' చట్టాన్ని ఉల్లంఘిస్తూ పొగాకు ఉత్పత్తులను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. చట్టప్రకారం స్కూళ్లు, కాలేజీలకు వంద మీటర్ల పరిధిలో గుట్కా, పాన్, సిగరెట్లు అమ్మడం నేరమని  తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అన్నారు.  సంబంధిత అధికారుల అలసత్వం కారణంగా విద్యా సంస్థలకు పక్కనే  నిబంధనలు అతిక్రమించి సిగరెట్లు, గుట్కాలు అమ్ముతున్నారని, చట్టానికి వ్యతిరేకంగా ఉన్న షాపులను తొలగించాలని కోరారు.  అధికారులకు జరిమానాలతో పాటు క్రిమినల్ కేసులు పెట్టే అధికారం ఉందని కూడా తెలిపారు. ఎక్కడైనా ఇలాంటి అక్రమ విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులకు లేదా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

**'సివోటిపిఎ' చట్టం ఏం చెబుతోంది?**

భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం, 'సిగరెట్లు మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం 2003. సెక్షన్ 6' ప్రకారం.. ఎలాంటి స్కూళ్లు అయిన, కాలేజీలు, కోచింగ్ సెంటర్ల లాంటి విద్యాసంస్థలకు వంద మీటర్ల (100 గజాల) పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం పూర్తిగా నిషేధం. యువత మరియు విద్యార్థులు చిన్న వయసులోనే చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉండేందుకే ఈ కఠినమైన చట్టాన్ని తెచ్చారు.

# యువతే దేశ భవిష్యత్తు

**నీట్ ప్రశ్నాపత్రాల లీకు, పరీక్షల రద్దుకు కారణం బిజెపి ప్రభుత్వమే**

**విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోంది**

**కేంద్ర ప్రభుత్వం విద్యకు కేటాయించిన బడ్జెట్ కంటే మూడు రెట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఖర్చు**

**బిజెపి ప్రభుత్వం భారీ ఎత్తున విగ్రహాలు పెడితే.. విద్యార్థుల తలరాతలు మారుతాయి**

**వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ( శాట్స్ ) చైర్మన్ శివసేన రెడ్డి**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విద్యార్థి భవిష్యత్తుతో చెలగాటమాడుతుందని, యువతను విస్మరిస్తే బిజెపి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని ఘాటుగా విమర్శించారు. యువత దేశానికి వెన్నెముక వంటిదిని, ఆ యువతే  భారత దేశ భవిష్యత్తు అని డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."ఛాత్రోన్ కి గుంజ్" నినాదంతో విద్యార్థుల సమస్యలపై గళమెత్తాలన్నారు. అలాగే ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, ఉద్యోగ నియామకాలలో జాప్యం, పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో నెలకొన్న వైఫల్యాలపై విద్యార్థులు, యువత గళమెత్తాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు "ఛాత్రోన్ కి గుంజ్" నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దులు విద్యార్థుల కష్టాన్ని వృథా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది ఖాళీ ఉద్యోగాలు ఉన్నప్పటికీ నియామక ప్రక్రియలు ఆలస్యం కావడం వల్ల యువత నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు, నాణ్యమైన విద్య వంటి అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం యువత ఐక్యంగా ముందుకు రావాలని సూచించారు. "విద్య, ఉద్యోగాలు, భవిష్యత్తు కోసం విద్యార్థుల గొంతుక దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించాలి. అదే 'ఛాత్రోన్ కి గుంజ్' లక్ష్యం" ముందుకెళ్లాలన్నారు. విద్యార్థులను సంక్షేభంలోకి బిజెపి నెట్టేసిందని నీట్ పరీక్ష ఎంత ఖర్చు చేస్తుందో, కేంద్ర ప్రభుత్వం విద్యకు కేటాయించిన బడ్జెట్ కంటే మూడు వంతులు విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లితండ్రులు ఖర్చు చేస్తున్నారన్నారు. ఇప్పటికే పార్టీలకు అతీతంగా విద్యార్థులు దేశ రాజధానిలో ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్న సంగతులను గుర్తు చేశారు. బిజెపి పార్టీ అధికారంకు వచ్చినప్పటి నుంచి విద్యావ్యవస్థ పుట్టింది అన్నట్లు మాట్లాడడం విడ్డూరకరమన్నారు. దేశంలో ఎస్ఎస్సి, యుపిఎస్సి, ఆర్ఆర్బి,జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల కోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతో వ్యయ ఖర్చులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరించిన తీరే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ వ్యవహరించిందని దుయ్యబడ్డారు. అలాగే దేశంలో విద్యార్థుల కోసం దేశ ప్రగతి కోసం పాటుపడిన నాయకుడు జవహర్ లాల్ నెహ్రూ అన్నారు. నెహ్రు ప్రధానిగా ఉన్న హయాంలోనే  జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఐఐటీలు, ఎయిమ్స్ , ఐఐఎమ్ లు, యూజిసి వంటి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలకు పునాది పడింది. నేడు లక్షలాది మంది విద్యార్థులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు ఈ సంస్థల ద్వారా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న విషయాలను గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలో విద్యకు విశేష ప్రాధాన్యత ఇస్తూ కులాలకు అతీతంగా ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ డెవలప్మెంట్, స్పోర్ట్స్ అథారిటీ యూనివర్సిటీ, నెలకొల్పేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి, తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, బి కృష్ణ, ధనలక్ష్మి, సుఖేందర్ రెడ్డి, వాల్య నాయక్, శరవంద, పాండు సాగర్, నందిమల్ల చంద్రమౌళి, పలువురు పాల్గొన్నారు.

# పోలీస్ విధుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పోలీస్ డ్యూటీ మీట్

**వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బంది**

**సాంకేతిక పరిజ్ఞానం, సమర్ధతతో విధులు నిర్వహించాలి**

**జిల్లా ఎస్పీ డి.జానకి**





**మహబూబ్ నగర్ ,అక్షిత న్యూస్:** జిల్లా పోలీసు సిబ్బందిలో విధి నిర్వహణ సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యాలు మరియు వృత్తిపరమైన ప్రతిభను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో జిల్లా స్థాయిలో పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి.జానకి పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా పోలీసు శాఖలో కీలకమైన పలు విభాగాలకు సంబంధించిన పోటీలను నిర్వహించారు. శాస్త్రీయ ఆధారాల సేకరణ, సంఘటన స్థల పరిశీలన, సాక్ష్యాధారాల పరిరక్షణ వంటి అంశాల్లో సిబ్బంది ప్రతిభను పరీక్షించారు. పోటీలలో అనుమానాస్పద వస్తువులను గుర్తించడం, భద్రతా తనిఖీలు నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే సామర్థ్యాన్ని అంచనా

తమ శిక్షణా నైపుణ్యాలు, ట్రాకింగ్ సామర్థ్యం, అనుమానితులను గుర్తించే ప్రతిభను ప్రదర్శించాయి. పోలీసు విధుల్లో డాగ్ స్క్వాడ్ పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా వెల్లడైంది.

మ  విభాగంలో సిబ్బంది కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ టెక్నాలజీ వినియోగం, డేటా నిర్వహణపై తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఆధునిక పోలీసింగ్‌లో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని అధికారులు తెలిపారు.

పోటీలలో సంఘటన స్థలాల ఫోటోగ్రఫీ, సాక్ష్యాధారాలను స్పష్టంగా నమోదు చేయడం వంటి అంశాల్లో సిబ్బంది ప్రతిభను అంచనా వేశారు.

విభాగంలో వీడియో రికార్డింగ్, సంఘటనల డాక్యుమెంటేషన్, ఆధారాల సేకరణలో సాంకేతిక నైపుణ్యాలను పరీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో సాంకేతిక పరిజ్ఞానం, అప్రమత్తత, సమర్థత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఇలాంటి డ్యూటీ మీట్ పోటీల ద్వారా సిబ్బందిలో నైపుణ్యాలు మరింత మెరుగుపడి, ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చీదీ రత్నం, ా= అదనపు ఎస్పీ సురేష్ కుమార్, భూత్పూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, =× లు కృష్ణయ్య నగేష్ అశోక్ కుమార్ మరియు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితా రూపకల్పనలో అర్హులైన ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలి

**అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి**

**డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**






మెదక్ అక్షిత బ్యూరో: ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఒక వజ్రాయుధంలాంటిదని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహణకు ఓటరు జాబితాను మరింత సమగ్రంగా , పారదర్శకమైనదిగా రూపొందించుటకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)లో అర్హులైన ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.

ఎస్ఐఆర్-2026పై ఓటర్లలో అవగాహన కల్పించేందుకు గాను జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 2కె రన్‌ను మెదక్ జిల్లా కేంద్రంలోని. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం వద్ద జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.

అక్కడి నుంచి రాందాస్ చౌరస్తా వరకు వరకు ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటరు జాబితా ఖచ్చితత్వంపై ఆధారపడి ఉంటుందని, ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును నమోదుచేసుకోవాలన్నారు, అలాగే ఇప్పటికే నమోదు చేసుకున్న పౌరులు తమ పేర్లు ను తనిఖీ చేసుకోవచ్చునని, అవసరమైతే సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకోనుటకు సహాయం కోసం బూత్ లెవెల్ అధికారులను సంప్రదించవచ్చని అన్నారు.

పారదర్శకమైన, సమగ్రమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించేందుకు (సర్) కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.

ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని తెలిపారు.

ఈ ప్రక్రియలో ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

మృతిచెందిన వ్యక్తుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించడం ద్వారా మరింత ఖచ్చితమైన ఓటరు జాబితా ను రూపకల్పన చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ముఖ్యలక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని అన్నారు.

ఓటర్ల నమోదు, సవరణలు, అభ్యంతరాలు, క్లెయిమ్స్‌కు సంబంధించిన వివరాలను సంబంధించి బూత్ లెవెల్ అధికారులను సంప్రదించవచ్చి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

అర్హులకు ఓటు హక్కు కల్పించడం ఎంత ముఖ్యమో అనర్హులను ఓజరు జాబితా నుండి తొలగించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సత్ప్రవర్తనతో మెలిగి ప్రజాస్వామ్యంలో ఉత్తమ పౌరులుగా ఆదర్శంగా నిలవాలన్నారు.

జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. సర్ లో ప్రజలందరి భాగస్వామ్యం అవసరం అన్నారు. సర్ కార్యక్రమం వల్ల నకిలీ ఓట్లు తొలిగిపోతాయన్నారు. యువత మత్తు పదార్థాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు.

యువత ఉన్నత లక్ష్యాల వైపు దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.

మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్ మాట్లాడుతూ.. బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు సర్ దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 18 సంవత్సరాల నుండి యువతీ యువకులు అందరూ ఓటరుగా నమోదు చేసుకొని, మరణించిన వారిని, రెండుసార్లు ఓటరుగా నమోదైన వారిని తొలగించే ప్రక్రియని ఆమె తెలియజేశారు.

అనంతరం జిల్లాను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫీ పాయింట్ లో కలెక్టర్ అదనపు ఎస్పీ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, తాహసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఎలక్షన్ సూపరిండెంట్ గఫార్, ఆర్ అండ్ బి ఈ.ఈ వేణు, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు , విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

## జగదీశ్వర్ గౌడ్ జన్మదినోత్సవ వేడుకల్లో అన్నదానం పండ్ల పంపిణీ ..



మియాపూర్ అక్షిత ప్రతినిధి: శేరిలింగంపల్లి ఐకానిక్ పర్సనాలిటీ, టీపీసీసీ జనరల్ సెక్రటరీ, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మియాపూర్‌లోని వివేకానంద ఆశ్రమంలో అన్నదాన మహా సేవ, పండ్ల పంపిణీ మరియు కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

"మానవ సేవే మాధవ సేవ అనే మహోన్నత స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనాథ చిన్నారులు, వృద్ధాశ్రమ వాసులకు అన్నదానం పండ్ల పంపిణీ చేసి వారి ముఖాల్లో ఆనందాన్ని నింపారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్ తనయుడు వైభవ్ కృష్ణ,అభిషేక్ గౌడ్ పాల్గొని, వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో యలమంచి ఉదయ్ కిరణ్ వ్యవస్థాపకులు చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ మాట్లాడుతూ వి. జగదీశ్వర్ గౌడ్ విశిష్ట నాయకత్వం మరియు ప్రజాసేవా ప్రయాణాన్ని కొనియాడారు.ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడిగా, శేరిలింగంపల్లికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన వ్యక్తిత్వంగా, ప్రజాసేవను రాజకీయాల కంటే గొప్ప బాధ్యతగా భావించే నాయకుడిగా జగదీశ్వర్ గౌడ్ నిలిచారని పేర్కొన్నారు.ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, శేరిలింగంపల్లి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. హ్యాట్రిక్ కార్పొరేటర్‌గా, ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండే నాయకుడిగా ప్రజల ప్రేమాభిమానాలను సంపాదించుకున్నారని కొనియాడారు.

యువతకు స్ఫూర్తిగా, మహిళలకు ధైర్యంగా, పేద ప్రజలకు భరోసాగా, పార్టీ కార్యకర్తలకు మార్గదర్శిగా నిలుస్తున్న జగదీశ్వర్ గౌడ్ నాయకత్వం సేవ, సమర్పణ, నిబద్ధతకు ప్రతిరూపమని పేర్కొన్నారు.నాయకత్వం అంటే పదవి కాదు ప్రజల కోసం నిలబడే ధైర్యం ప్రజల మనసుల్లో స్థానం సంపాదించే వ్యక్తిత్వం అదే వి. జగదీశ్వర్ గౌడ్ అని యలమంచి ఉదయ్ కిరణ్ అన్నారు.ఈ కార్యక్రమం ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన ఒక మహోన్నత నాయకుడికి అంకితమైన సేవా నివాళిగా నిలిచింది. ప్రజల ప్రేమ, విశ్వాసాలను తన బలంగా మార్చుకుని ముందుకు సాగుతున్న జగదీశ్వర్ గౌడ్ నాయకత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సునీల్,గిరి,నడిమింటి కృష్ణ,అమర్నాథ్, మూర్తి, సాంబశివరావు, బాలకృష్ణ, రంగారావు, వల్లభనేని సత్యనారాయణ, నాగేశ్వరరావు, భాస్కర్ గౌడ్,రాంచందర్ గౌడ్,రవి కుమార్,శేఖర్ గౌడ్,నర్సారెడ్డి,సురేష్,కామినేని శ్రీనివాస్ ,శ్రీకాంత్, శరత్, వంశీ, ప్రవీణ్, రత్నాచారి, నవీన్, సత్య, మురళి, భార్గవ్, శ్రీరామ్, అశోక్,వినోద్,నందు,అంజి,గోపి,శశి,రమేష్,గోపాల్,స న్ని,శివ,రాజేష్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పక్కాగా ఓటర్ జాబితా



మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి : ఈ నెల 25 నుండి ఎన్నికల సంఘం చేపట్టే ప్రత్యేక విస్తృత ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్)కార్యక్రమానికి రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి కోరారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన అఖిల పక్షం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ నిర్వహించే ఎన్యూమరేటర్లకు ఆయా రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు అందుబాటులో ఉండి సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగమణి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, బిఆర్ఎస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి. ఇలియాస్ ఖాన్, సిపిఎం నాయకులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, వి.వెంకటేశ్వర్లు, బిజెపి నాయకులు చిలుకూరి శ్యాం, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ ఆదోతు అశోక్, నాగునాయక్, పాతూరి శరత్, జెట్టి లింగయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కె. అశోక్, బిఎస్పి నాయకులు ఎన్మై గాలిబ్ లు పాల్గొన్నారు.

## నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దూడ వెంకటేష్ నియామకం....!



ఆర్మూర్, అక్షిత ప్రతినిధి: నిజామాబాద్ జిల్లా నందిపేట మండల కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా దూడ వెంకటేష్ నియమితులయ్యారు. ఈ నియామకాన్ని కృషి చేసిన తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

దూడ వెంకటేష్ గతంలో ఉమ్మెడ, మాయాపూర్ గ్రామాలకు ఎంపీటీసీగా సేవలందించి ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు. గత 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు.

ఈ సందర్భంగా దూడ వెంకటేష్ మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా మచ్చలేని కాంగ్రెస్ కార్యకర్తగా పనిచేస్తున్నానని, నందిపేట్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. కింది స్థాయి కార్యకర్త నుంచి సీనియర్ నాయకుల వరకు అందరినీ సమన్వయం చేసుకుంటూ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అలాగే ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో పార్టీకి మరింత మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావడానికి శ్రమిస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నందిపేట్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని దూడ వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

"కార్యకర్తలే పార్టీకి బలం. అందరినీ కలుపుకొని నందిపేట్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే నా లక్ష్యం" అని దూడ వెంకటేష్ అన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక

గురువారం | 25| జూన్ | 2026

# ఓటర్ జాబితా సవరణలో ప్రజలు సహకరించాలి

### ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణకార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి




**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోజూన్ 25,2026 నుండి ప్రారంభం కానున్న స్పెషల్ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కార్యక్రమాన్నివిజయవంతం చేయడం జరిగిందనికల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి తెలిపారు.బుధవారం కల్వకుర్తి పట్టణ తహసీల్దార్ (ఎమ్మార్వో)ఇబ్రహీంఆధ్వర్యంలో ఎస్ఐఆర్–2026 కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించారు.ఎమ్మార్వో కార్యాలయం నుండి హైదరాబాదు చౌరస్తా వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో అధికారులు,విద్యార్థులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.అనంతరం హైదరాబాద్ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్డీఓ జనార్దన్ రెడ్డిమాట్లాడారు.భారత ఎన్నికల సంఘం అర్హులైన ప్రతిపౌరుడిని ఓటరుజాబితా లో చేర్చడం,అనర్హుల పేర్లను తొలగించడం లక్ష్యంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు)ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని,ప్రజలు తమ పూర్తి వివరాలను అందించి ఫారాలను సక్రమంగానింపాలని సూచించారు.ఫారంలో ప్రస్తుత ఫోటో,ఆధార్ నంబర్,ఫోన్ నంబర్,తల్లిదండ్రులు లేదా జీవిత భాగస్వామి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.అలాగే 2022 స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జాబితాలో ఉన్న తల్లిదండ్రులు లేదా



తాతమ్మల వివరాలను కూడానమోదుచేయాల్సి ఉంటుందనిచెప్పారు"మీ ఓటు మీ బాధ్యత.ప్రతి ఓటరుతమవివరాలను ఓటరు జాబితాలో నవీకరించుకోవాలి.బీఎల్వోలు ఇంటికి వచ్చినప్పుడు వారికి పూర్తి సహకారం అందించాలిఅని ఆర్డీఓ జనార్దన్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం,మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ ఎక్సైజ్,సిఐ వెంకట్ రెడ్డి సీఐ భీమ్ కుమార్ ఎంఈఓ శంకర్ నాయక్ సూపరిండెంట్ డాక్టర్ శివరాం అగ్రికల్చర్ ఏవో స్పెషల్ ఆఫీసర్ సురేష్ కల్వకుర్తి పట్టణంలోని కౌన్సిలర్లు ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థల సభ్యులు మహిళలు ప్రత్యేకంగా జెపి నగర్ గురుకుల విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది

## ప్రతి ఓటరు కీలకమైన పాత్ర పోషించాలి

### అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నా . డా. చిక్కుడు వంశీకృష్ణ (ఎమ్మెల్యే అచ్చంపేట). ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటరు కీలకమైన పాత్ర పోషిస్తారు. ఈ క్రమంలోనే రాబోయే కాలంలో మరింత పారదర్శకత, పటిష్టమైన ప్రణాళిక కోసం 'ఓటర్ మ్యాపింగ్' ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించాము. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు సక్రమంగా అందేలా చూడటమే మా లక్ష్యం..

## స్పెషల్ లాంచ్ లింగాల మండల్ గిరిజన మహిళా ఎంపిక




**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** స్పెషల్ లాంచ్ లింగాల మండల్ గిరిజన మహిళా ఎంపిక ముఖ్యమంత్రి ఆలోచన మేరకు తెలంగాణ లో జరిగే మహిళలపై బాలబాలికలపై జరిగే ఆగత్యాలకు ప్రశ్నించే గొంతుక నాగర్కర్నూల్ జిల్లా లింగాల మండల అప్పయిపల్లి గ్రామ సర్పంచ్ విజయకృష్ణ నాపై నమ్మకం ఉంచి నన్ను ఇస్తాయికి చేరడానికి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ కి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ నాకు అన్నివిధాలా సహాయ సహకారం అందిస్తున్న మా కుటుంబ సభ్యులకు వేట అధినేత చైర్మన్ కి కమిటీ సభ్యులకు ధన్యవాదములు

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఒలింపిక్ డే రన్ దోహదం చేస్తుంది: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** ఒలింపిక్ డే రన్ అనేది కేవలం క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మైదానంలో నిర్వహించిన 40వ అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఒలింపిక్ టార్చ్ వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడలను జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని, క్రీడా రంగంలో మరింత మంది యువత రాణించాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ మైదానం నుంచి ఐబీ వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు హరికిషన్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ జగన్, సంయుక్త కార్యదర్శులు వెంకటేశం, జేశ్వంత్ గౌడ్, పీఈటీ సంఘం బాధ్యులు షర్ఫుద్దీన్, సుభాష్ గౌడ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట- అమ్మనబోలు రూట్లో ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో

### విద్యార్థుల నిరసన



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట--అమ్మనబోలు రూట్లో ఆర్టీసీ బస్సును తక్షణమే పునరుద్ధరించి విద్యార్థుల రవాణా సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించి విద్యార్థులు నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రామన్నపేట మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా రామన్నపేట--అమ్మనబోలు రూట్లో ఆర్టీసీ బస్సు నడవకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ రూట్ పరిధిలోని 9 గ్రామాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు వివిధ విద్యాసంస్థల్లో చదువుకుంటున్నప్పటికీ, మండల కేంద్రానికి కనీస రవాణా సౌకర్యం లేక విద్యాభ్యాసానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వ, ఆర్టీసీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. విద్యార్థుల సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని విమర్శించారు. ప్రతిరోజూ ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి రావడంతో ఒక్కో విద్యార్థి రోజుకు సుమారు రూ.100 వరకు ఖర్చు భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారంగా మారిందని పేర్కొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం (డీఎం ఆఫీస్) ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు పెద్ది అక్షిత, మండల నాయకులు పిట్టల నవీన్, అప్పం అభిరూప్, బూడిద యశ్వంత్, ముక్కిడి ప్రవీణ్, తుర్కపల్లి లోకేష్, అభినవ్, శ్రావ్య, అనుప్రియ, హారిక తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో బీజేపీ బీఎల్ఏల జాబితా సమర్పణ



**భద్రాచలం, అక్షిత న్యూస్:** భారత ఎన్నికల సంఘం జూన్ 25 నుండి ప్రారంభించనున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం స్పెషల్ ఇంటెన్సు రివిజన్ సార్ లో భాగంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) భద్రాచలం నియోజకవర్గానికి సంబంధించిన బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) జాబితాను బుధవారం భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎలక్షన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఏ ఈ ఆర్ ఓ కోట రవికుమార్ కి పార్టీ నాయకులు అందజేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, వివరాల మార్పులు, అభ్యంతరాల పరిశీలన, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ఎన్నికల సంఘం చేపట్టనున్న కార్యక్రమాలకు సహకరించే ఉద్దేశ్యంతో పార్టీ తరఫున నియమించిన బీఎల్ఏల వివరాలను అధికారికంగా సమర్పించినట్లు నాయకులు తెలిపారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ బీజేపీ బీఎల్ఏ ఇంచార్జీ కుంజా సంతోష్, బీజేపీ నాయకులు ములిశెట్టి రాంమోహన్ రావు, అల్లాడి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన వెంకన్న, బోడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.